క్లుప్తంగా

ఈవీఎం వీవీ ప్యాడ్స్ పరిశీలన



ఫిరంగిపురం: మండలంలోని రేపూడి గ్రామం లోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని గోడౌన్‌లో భద్రపర్చిన ఈవీఎం వీవీ ప్యాడ్స్‌ను ఆర్డీఓ శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. గోడౌన్‌లో భద్రపరిచిన వీవీ ప్యాడ్స్‌ను సీసీ టీవీల పనితీరు, అగ్నిమాపక సంబంధ భద్రత ప్రమాణాలు ఎలా ఉన్నదీ పరిశీలించారు. రికార్డులు పరిశీలించి సెక్యూరిటీ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ జె.ప్రసాదరావు, పార్టీల నాయకులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

కులగణనలో అభ్యంతరాలు తెలపండి


తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని 17 గ్రామాల్లో షెడ్యూల్ కులాల కులగణనకు సంబంధించి మార్పులు, చేర్పులు, అభ్యంతరాలు ఉంటే సంబంధిత సచివాలయాల్లో తెలియజేయాలని దుగ్గిరాల తహసీల్దార్ సునీత శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు షెడ్యూల్ కులాలకు సంబంధించి జాబితాను ప్రతి గ్రామ పరిధిలో సచివాలయాల్లో ఏర్పాటు చేశామని, ఆ సచివాలయాల్లో ఉన్న షెడ్యూల్ కులాల వారు చూసి వాటిలో ఏమైనా మార్పులు ఉంటే సచివాలయంలోనే తెలియజేయాలని, అనంతరం గ్రామ రెవెన్యూ అధికారి క్షేత్ర స్థాయిలో విచారణచేసి ఆమోదం కోసం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ద్వారా తహసీల్దార్‌కు పంపడం జరుగుతుందని, తహసీల్దార్ నిర్ణయం మేరకు ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఫిర్యాదులు లేదా అభ్యంతరాలు పరిష్కరించిన అనంతరం గ్రామ సచివాలయంలో తుది జాబితాను ప్రచురించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని షెడ్యూల్ కులాల వారు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సునీత ఆ ప్రకటనలో కోరారు.

గ్రహణం మొర్రి బాధితులకు వైద్యశిబిరం



ఫిరంగిపురం: మండలకేంద్రంలోని క్రీస్తునగర్‌లో డెవలప్ మెంట్ యాక్షన్ ఫర్ నీడ్ స్వచ్ఛంద సంస్థ, ఆపరేషన్ స్మైల్ సహకారంతో శుక్రవారం గ్రహణం మొర్రి బాధితులకు వైద్యశిబిరం నిర్వహించారు. ఆపరేషన్ స్మైల్ ప్రతినిధులు దుర్గేశ్వరి షాడియో, శుభమ్ బిశ్వాస్ మరియు పిన్నమనేని సిద్ధార్థ వైద్యుడు ప్రియకుమార్‌లు 15 మందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. వారిలో ఆపరేషన్ కోసం ఏడుగురిని ఎంపికచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రహణం మొర్రి ఆపరేషన్ కోసం ఎంపిక చేసిన వారికి కృష్ణాజిల్లా గన్నవరంలోని పిన్నమనేని సిద్ధార్థ వైద్యశాలలో అనుభవజ్ఞులైన వైద్యులచే ఉచితంగా ఆపరేషన్ చేయించనున్నట్లు తెలిపారు. జనవరి 10 నుంచి 19 వరకు ఈ ఉచిత ఆపరేషన్లు చేస్తున్నామని చెప్పారు. ఆపరేషన్ చేయించుకున్న వారికి భోజన వసతితోపాటు ఉచితంగా రవాణా సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. అనంతరం ఎంపిక చేసిన వారికి ఓపీ పత్రాలు అందజేశారు. డెవలప్ మెంట్ యాక్షన్ ఫర్ నీడ్ స్వచ్ఛంద సంస్థ తరఫున వేణు పాల్గొన్నారు.

ఘనంగా కోస్టల్ బ్యాంక్ సిల్వర్ జూబ్లీ వేడుకలు



తాడేపల్లిరూరల్: కోస్టల్ బ్యాంక్‌ను స్థాపించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఉండవల్లి కోస్టల్ బ్యాంక్ శాఖ ఆధ్వర్యంలో సిల్వర్ జూబ్లీ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ వర కుమారరావు మాట్లాడుతూ కోస్టల్ బ్యాంక్ సిల్వర్ జూబ్లీ సందర్భంగా కేక్ కట్ చేశామని, అనంతరం ఖాతాదారులతో సమావేశం నిర్వహించి నూతన సంవత్సర డైరీలు, క్యాలెండర్లను అందజేశామని తెలిపారు. 25 సంవత్సరాలుగా కోస్టల్ బ్యాంక్‌ను ఆదరిస్తున్న ఖాతాదారులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. బ్యాంక్ సిబ్బంది శ్రీనాథ్, ఎస్‌కె.సులేమాన్, పీఎల్ సరోజ, నాగార్జున, ఖాతాదారులు పాల్గొన్నారు.

తాపీ కార్మికుడు ఆత్మహత్య

తెనాలిరూరల్: తాపీ కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కథనం మేరకు పట్టణ గురవయ్య కాలనీకి చెందిన చలంచర్ల వీరయ్య(32) తాపీ పనులకు వెళుతుంటాడు. ఇటీవల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఇతను ఇంట్లో శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఫిర్యాదు అందుకున్న వన్‌టౌన్ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హామీలు తుంగలో తొక్కిన చంద్రబాబు

విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వైఎస్సార్ సీపీ పోరుబాట

- ఆరు నెలల్లోనే చంద్రబాబు నిజస్వరూపం బయటపడింది
- ఒక్క హామీ కూడా పూర్తిగా నెరవేర్చని ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది
- ప్రజలపై మోపిన విద్యుత్ చార్జీల భారం వెంటనే తగ్గించాలి
- వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాలవజ్రబాబు
- తాడికొండ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట నిరసన, అధికారులకు వినతిపత్రం అందజేత



అడ్డరోడ్డు సబ్‌స్టేషన్ ఎదుట నిరసన తెలియజేస్తున్న వనమా బాలవజ్రబాబు, నాయకులు

తాడికొండ: ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీనీ తుంగలో తొక్కిన చంద్రబాబు 6 నెలల్లోనే ప్రజలను మోసం చేశాడని, అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన చంద్రబాబు పెంచిన చార్జీలు వెంటనే తగ్గించాలని తాడికొండ నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, గుంటూరు నగర డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు) అన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు తాడికొండ అడ్డరోడ్డులోని సబ్‌స్టేషన్ ఎదుట నిర్వహించిన నిరసన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలు వెంటనే తగ్గించాలని నిరసన తెలియజేసిన అనంతరం విద్యుత్ ఏఈ నాగ మల్లేశ్వరరావు, సబ్ ఏఈఈ నామా నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు జగనన్న కంటే మెరుగైన పాలన అందిస్తానని చెప్పిన చంద్రబాబు ఒక్క హామీ కూడా నెరవేర్చిన దాఖలా లేదన్నారు. ఎన్నికల ముందు చెప్పిన ప్రతి అంశాన్ని తుంగలో తొక్కాడని, సంక్షేమ పథకాలు ఏమీ ఆపబోమని, వైఎస్సార్‌సీపీ కంటే మెరుగైన పాలన అందిస్తానని చెప్పి బాబు అధికారంలోకి వచ్చి ఒక్క హామీ నెరవేర్చకపోగా ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు 9 వేల కోట్ల పై చిలుకు 85–90 శాతం ప్రజలపై భారం మోపిన చరిత్ర బాబుది అన్నారు. ఆ రోజు చంద్రబాబును ప్రజలు నమ్మారని, ఇతను మారి ఉంటాడు, ఆలోచనలు మారి ఉంటాయి ప్రజలకు సేవ చేద్దామనే ఆలోచనతో ఉండి ఉంటాడని అనుకున్నారని, కానీ ఆ నమ్మకాన్ని వమ్ము చేయడంలో చంద్రబాబు పెద్దన్న పాత్ర పోషిస్తాడన్న విషయం ప్రజలు గ్రహించలేక పోయారన్నారు. 2000 సంవత్సరంలో కూడా చంద్రబాబు విద్యుత్తు చార్జీలపై పోరాటం చేస్తున్న ప్రజలపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపి పలువురి మరణానికి కారణమైన బాబు తన మొండి వైఖరిని విడనాడకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇవ్వడంపై మంగళం పలికిన బాబు నేడు ట్రూ అప్ ఛార్జీల పేరుతో ప్రజలపై మోపిన విద్యుత్ ఛార్జీల భారం తక్షణమే తగ్గించపోతే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశ్రమించకుండా పోరాటం చేస్తామన్నారు. ప్రజలంతా మేల్కొని బాబు పాలనను గమనిస్తున్నారని, ఆయన 2–3 శాతం ప్రజలకు మాత్రమే ముఖ్యమంత్రిగా ఉన్నారే తప్ప 97 శాతం మందిని పట్టించుకోవడం లేదన్నారు. ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న చంద్రబాబు నాయుడు గద్దె దిగి పేద ప్రజకు మేలు జరిగే వరకు తమ పోరాటం ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.



విద్యుత్ ఏఈఈ నాగమల్లేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం



కాల్వలో పడేసిన కుర్చీలు

పీకి కాల్వలో పడేసిన టెంటు



టెంటు, కుర్చీలు తొలగించి పక్కన పడేయడంపై సీఐను ప్రశ్నిస్తున్న డైమండ్ బాబు

పోలీసుల అత్యుత్సాహం..

తాడికొండ అడ్డరోడ్డులోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీల పెంపుపై నిర్వహించిన పోరుబాట కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు తాడికొండ పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ప్రత్యేక బలగాలను రప్పించి సీఐ కె.వాసు ఆధ్వర్యంలో రోడ్డు పక్కన నిరసన తెలియజేసేందుకు వేసిన టెంటు, కుర్చీలను తొలగించి కాల్వలో పడేయించారు. దీనిపై స్పందించిన సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు సీఐ వాసుతో మాట్లాడుతూ అధికారం శాశ్వతం కాదని, ప్రజా సమస్యలపై బాధ్యతాయుతంగా పోరాటం చేస్తున్న ప్రతిపక్షాన్ని ఇలా చేయడం మంచిది కాదన్నారు. ప్రతి పక్షానికి సహకరించి ప్రజల పక్షాన పోరాటం చేసే అవకాశం ఇవ్వాలని కోరారు. ఎక్కడో రోడ్డు పక్కన పడేసిన టెంటు, కుర్చీలను తొలగించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

ప్రజల నడ్డి విరిచిన కూటమి ప్రభుత్వం



మంగళగిరిలో నిరసన ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, దొంతిరెడ్డి తదితరులు

- పెంచిన విద్యుత్ చార్జీలను సత్వరం తగ్గించాలి
- ప్రజలకు మేలు చేసే ఒక్క పథకమూ అమలు చేయకపోగా రూ.కోట్ల భారం వారిపై వేయడం దారుణం
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి
- ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఇతర నేతలతో కలిసి కొప్పురావూరు కాలనీ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా, వినతిపత్రం అందజేత



సబ్‌స్టేషన్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

మంగళగిరి: విద్యుత్ చార్జీలను పెంచి పేదలను టీడీపీ కూటమి ప్రభుత్వం దోచుకుంటోందని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు ప్రజలపై రూ.వేల కోట్ల చార్జీల భారం మోపిన ప్రభుత్వంపై నిరసనగా వైఎస్సార్ సీపీ పోరుబాట కార్యక్రమం శుక్రవారం పట్టణంలోని కొప్పురావుకాలనీలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను పెంచి పేదలను ప్రభుత్వం దోచుకుంటుదన్నారు. పేదలకు విద్య వైద్యం అందించడంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేశారని, నేడు చంద్రబాబు సంపద సృష్టిపేరుతో పేదలను దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారన్నారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్ పేదల కోసం నవరత్నాల పథకాలను ప్రవేశపెట్టి వారి అభ్యున్నతికి కృషి చేశారని, నేడు చంద్రబాబు ప్రభుత్వం ఒక్క పథకం సక్రమంగా ప్రజలకు అందించడం లేదన్నారు. అనంతరం కొప్పురావు కాలనీలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మాజీ ఆప్కో చైర్మన్ చిల్లపల్లి మోహనరావు, పట్టణ కన్వీనర్ ఆకురాతి రాజేష్, నాలి వెంకటకృష్ణ, ఈదులమూడి డేవిడ్ రాజు, ముదిగొండ ప్రకాష్, మల్లవరపు సుధారాణి, గుంటి రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు అరుణకుమారి, సుభాని, మాబు పాల్గొన్నారు.

సిరిపురం తిరునాళ్లకు కట్టుదిట్టమైన భద్రత

మేడికొండూరు సీఐ నాగూర్ మీరా సాహెబ్



దేవాలయ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న సీఐ నాగూర్ మీరా సాహెబ్

మేడికొండూరు: మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో ఉన్న బాలయేసు నామకరణ దేవాలయంలో జనవరి 1న నిర్వహించనున్న మహోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దేవాలయ కమిటీ సభ్యులు జాగ్రత్త వహించాలని మేడికొండూరు సీఐ నాగూర్ మీరా సాహెబ్ సూచించారు. గ్రామంలో శుక్రవారం దేవాలయంలో ఫాదర్ ఎస్.వి.థామస్ రెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. సీఐ మాట్లాడుతూ దేవాలయ ప్రాంతంలో బాణసంచా కాల్చే సమయంలో తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. దేవాలయానికి అధిక సంఖ్యలో వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూసుకోవాలన్నారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. వాహనాల రాకపోకలను ఎటువైపు మళ్లించాలో క్షుణ్ణంగా పరిశీలించారు. మహోత్సవానికి సంఘస్తుల తేర్లు ఎటు వైపు నుంచి వస్తాయి, వాళ్లు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయంపై సీఐ పలు సూచనలు చేశారు. ప్రశాంత వాతావరణంలో మహోత్సవం జరిగేలా ప్రజలంతా సహకరించాలని కోరారు. ఫాదర్ ఎస్‌వీ థామస్ రెడ్డి, దేవాలయ కమిటీ సభ్యులు ఏరువ సౌరెడ్డి, జోసఫ్ రెడ్డి, పసల మరియదాసు, కాసు జోసఫ్ రెడ్డి, వార్డు నెంబర్ విజయ, దోప్పలపూడి సాయి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతను గౌరవించాల్సిన బాధ్యత అందిరిదీ

స్కాట్స్ అండ్ గిల్డ్ ఆధ్వర్యంలో ఘనంగా రైతు దినోత్సవం



రైతును సత్కరిస్తున్న గిల్డ్ సభ్యులు

తాడికొండ: దేశానికి పట్టెడన్నం పెట్టే రైతన్నను గౌరవించుకోవాల్సిన బాధ్యత అందిరిపై ఉందని ఇండియన్ స్కాట్స్ అండ్ గిల్డ్ సభ్యులు కొనియాడారు. తాడికొండలో నిర్వహించిన రైతు దినోత్సవంలో భాగంగా పలువురు మాట్లాడుతూ దేశానికి రైతన్న వెన్నెముక అని, అలాంటి రైతులకు ప్రతి ఒక్కరూ అండగా నిలిచి గౌరవించాలని సూచించారు. అనంతరం పెదపరిమి మాజీ సర్పంచ్, రైతు భాష్యం సాంబశివరావును సత్కరించారు. గిల్డ్ సభ్యులు త్రిపురనేని మల్లేశ్వరరావు, కందుల గోపాలరావు, చింతల భాస్కరరావు, శివపార్వతి, ఆలపాటి శ్రీమన్నారాయణ, గోగినేని సాంబశివరావు, జొన్నల సుబ్బారెడ్డి, మున్నంగి సూరారెడ్డి, భాస్కర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామూహిక శ్రీలక్ష్మీపూజ



మంగళ శాసనాలు అందజేస్తున్న శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్‌స్వామి

తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని బాపూజీ విద్యాలయంలో ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా 12వ పాశురాన్ని శుక్రవారం శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్‌స్వామి భక్తులకు వివరించారు. ఉదయం గోదా అమ్మవారికి అష్టోత్తరం, తీర్థ ప్రసాద గోష్ఠి, మంగళ శాసనాలు అందజేశారు. సాయంత్రం సామూహిక శ్రీ లక్ష్మీ పూజను నిర్వహించారు. పెనుమాక, కొండపల్లి, సత్యనారాయణ పురం, రావిపాడు, మందాల గ్రామం తదితర ప్రాంతాల నుండి సుమారు 700 మంది భక్తులు గోదాదేవి అమ్మవారికి సారె సమర్పించారు. భక్తులకు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్‌స్వామి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఏసీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు

తాడేపల్లిరూరల్: బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ కార్మికుల సమస్య 30 సంవత్సరాలు గడుస్తున్నా పరిష్కారం కాకపోవడం బాధాకరమని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు అన్నారు. శుక్రవారం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని సందర్శించి వారికి మద్దతు తెలియజేసిన అనంతరం వేముల దుర్గారావు మాట్లాడుతూ నేటికి ఏసీసీ కార్మికుల నష్టపరిహారం సమస్య పరిష్కారం కాకపోవడం పాలకుల నిర్లక్ష్యమే అని అన్నారు. కనీసం 1993 మే నెలలో పనిచేసిన పనికి కూడా జీతం చెల్లించని యాజమాన్యంపై ఎటువంటి చర్యలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని కార్మికుల న్యాయమైన సమస్యను పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ మాట్లాడుతూ అర్ధాకలితో, అనారోగ్యాలతో కునారిల్లుతున్న ఏసీసీ కార్మికులపై కనీసం కనికరం అటు యాజమాన్యానికి కానీ ఇటు ప్రభుత్వాలకు గానీ లేకపోవడం బాధాకరమని అన్నారు. నాయకులు కె.ఆదినారాయణ, సాంబయ్య, సుబ్బారావు, కృష్ణ, టి.నాగేశ్వరరావు, ఇస్మాయిల్, గురవయ్య, రమాదేవి, అంకయ్య, గండికోట జ్యోతి, పి.వెంకటరత్నం, బి.నవనీతం, ఎం.శారద, పాల్గొన్నారు.

రాష్ట్రంలో షూటింగ్‌లకు మెరుగైన అవకాశాలు



మాట్లాడుతున్న దిలీప్‌రాజా

తెనాలి: టాలివుడ్‌లో ఇటీవల జరిగిన పరిణామాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు సినిమాల షూటింగ్‌లు జరిగేందుకు అవకాశాలు మెరుగయ్యాయని మా–ఏపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా అన్నారు. మా–ఏపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇప్పటికే కొందరు నిర్మాతలు రాష్ట్రంలో సినిమా షూటింగ్‌లకు సన్నాహాలు చేస్తున్నారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఇటీవల సినీ నిర్మాతలను రాష్ట్రంలో సినిమాల చిత్రీకరణకు స్వయంగా ఆహ్వానం పలికినట్టు గుర్తుచేశారు. విశాఖలో ఇప్పటికే సినీస్టూడియోలు నిర్మాణంలో ఉన్నాయనీ, తలకోన, తడ, హార్సిలీ హిల్స్, కోనసీమ, భవానీ ద్వీపం, కొండవీడు, సూర్యలంక బీచ్, అరకులోయ వంటి ఎన్నో అందమైన లోకేషన్లు రాష్ట్రంలో అందుబాటులో ఉన్నాయని గుర్తుచేశారు. రాష్ట్రంలో సినిమాల చిత్రీకరణకు ముందుకొచ్చే నిర్మాతలకు ఎఫ్‌డీసీ ద్వారా తగిన సహాయం చేసేందుకు మా–ఏపీ కూడా సహకరిస్తుందని వివరించారు. వీరితో సహాయ దర్శకులు నరేష్ దోనె, మణివరన్, నటుడు వేమూరి విజయభాస్కర్ ఉన్నారు.

అనాథలతో అంగడి పెట్టించిన తహసీల్దార్



అంగడి ప్రారంభోత్సవంలో ట్రైనీ ఐఏఎస్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలిరూరల్: వారంతా విధి రాత వలన అనాథలైన వారు.. నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించే హోమ్‌లో చేరిన వారు ఇతరులపై ఆధారపడకూడదన్న సంకల్పంతో తమ సృజనకు పదును పెట్టారు. వివిధ వస్తువులు, హ్యాండ్ బ్యాగులు తయారు చేస్తున్నారు. ఈ విషయాన్ని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ గుర్తించారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు కిన్నెర నాగరాజు ఇటీవల అంగలకుదురులోని జీఎంజీ స్వధార్ హోమ్‌లో అనాథలు, వితంతువులు ఉంటున్నారని, వారికి ప్రభుత్వపరంగా సాయం అందేలా చూడాలని గ్రీవెన్స్‌లో కోరారు. మరునాడు స్వధార్ హోమ్‌ను తహసీల్దార్ పరిశీలించారు. అక్కడ ఉంటున్న వారి స్థితిగతులను స్వయంగా చూశారు. ప్రభుత్వం నుండి నెల నెలా 50 కిలోల రేషన్ బియ్యం అందజేస్తామని, అర్హత ఉన్న వారికి పింఛన్‌లు ఇస్తామని, ఉపాధి అవకాశాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు. అక్కడ ఉంటున్న వారిలో కొందరు బొమ్మలు, బ్యాగులు తయారు చేస్తున్నారని గుర్తించారు. వీరి సృజననే పెట్టుబడిగా పెట్టించి వీరికి జీవనోపాధి కల్పించాలని ఆలోచన చేశారు. ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్‌తో మాట్లాడారు. చిన్న అంగడి ఏర్పాటు చేసుకోవడానికి జాగా ఇవ్వమని కోరగా ఆయనా అంగీకరించారు. తహసీల్దార్ స్వయంగా అంగడి తయారు చేయించారు. బస్టాండ్ వద్ద అంగడిని పెట్టించి, ట్రైనీ ఐఏఎస్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ శుక్రవారం ప్రారంభించారు. జీఎంజీ స్వధార్ హోమ్ నిర్వాహకుల పర్యవేక్షణలో అక్కడ ఉండే అనాథ బాలికలు, యువతులు తయారు చేసిన వస్తువులను ఇక్కడ ఇక్రయిస్తారని, విధి రాత వల్ల నష్టపోయిన వీరికి ప్రజలు అండగా నిలవాలని తహసీల్దార్ కోరారు.

రైల్వే ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం 'స్నేహ హస్తం'

తెనాలిరూరల్: రైల్వే ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం 'స్నేహ హస్తం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు రైల్వే అసిస్టెంట్ పర్సనల్ ఆఫీసర్ పి. శ్రీనాథ్ తెలిపారు. తెనాలి రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో శుక్రవారం స్నేహ హస్తం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంక్రిమెంట్లు, సర్వీస్ ప్రమోషన్లు తదితర సమస్యల గురించి సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ ఆనంద్ కట్టా ఆదేశాలతో కార్యక్రమాన్ని నిర్వహించినట్టు శ్రీనాథ్ తెలిపారు. మొత్తం 60 సమస్యలను పరిష్కరించారు.

మద్యం మత్తులో ఘర్షణ

యువకుడికి తీవ్ర గాయాలు



గాయపడిన సంకురు దిలీప్‌కుమార్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని ఒకటో వార్డు మార్కెట్ వద్ద నివాసాల మధ్యలో ఐదుగురు వ్యక్తులు మద్యం సేవించి ఒక యువకుడిపై దాడిచేసిన సంఘటన ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. బాధితుడు సంకురు దిలీప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం జయరాజు, శివాజీ, రామస్వామి, వారితో పాటు మరో ఇద్దరు మూసివేసిన మార్కెట్ ఆవరణలో పూటుగా మద్యంసేవించి ఇంటికి వెళుతున్న దిలీప్‌ను పిలిచి అసభ్యంగా మాట్లాడి, విచక్షణా రహితంగా దాడి చేశారు. బండరాళ్లతో కొట్టేందుకు ప్రయత్నించడంతో అక్కడి నుంచి పారిపోయి తాడేపల్లి పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి దిలీప్‌ను పంపించారు. అక్కడి వైద్యులు పరీక్షించి కుడిచేయి రెండు చోట్ల విరిగిందని నిర్ధారించారు. జరిగిన ఈ సంఘటనపై తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని దిలీప్ తెలిపాడు.

పౌరాణిక నాటక ప్రదర్శనలు ప్రారంభం

నగరంపాలెం: స్థానిక శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో రెండు రోజులపాటు జరగనున్న పౌరాణిక నాటక ప్రదర్శనలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పౌరాణిక కళాకారుల సాంస్కృతిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు నల్లక శ్రీనివాసరావు ప్రారంభించారు. ప్రముఖ కళాకారులు గొట్టిపాటి నాగేశ్వరరావు శ్రీరాముడిగా, కె.కాశేశ్వరరావుచౌదరి ఆంజనేయుడుగా శ్రీరామాంజనేయ యుద్ధ ఘట్టాన్ని ప్రదర్శించారు. నటన ధురీణ కె.వెంకటేశ్వరరావు మయసభలోని దుర్యోధన పాత్ర ఏకపాత్రాభినయంతోపాటు, చింతామణి, పల్నాటి యుద్ధం, సత్యహరిశ్చంద్ర వంటి ప్రముఖ నాటికల్లో ముఖ్య ఘట్టాలను కళాకారులు ప్రదర్శించారు.

విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



తెనాలిఅర్బన్: విద్యతో పాటు క్రీడల పట్ల విద్యార్థులు ఆసక్తిని కలిగి ఉండాలని తెనాలి మండల విద్యాధికారి మేకల లక్ష్మీనారాయణ సూచించారు. పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపకులు తన్నీరు శివశంకర్ ఆధ్వర్యంలో వివిధ క్రీడలలో రాణించిన విద్యార్థులకు శుక్రవారం కొత్తపేటలోని మున్సిపల్ బాయ్స్ హైస్కూల్‌లో మెడల్స్, ప్రసంశపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదవుతూ క్రీడల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. తన్నీరు శివశంకర్ మాట్లాడుతూ తామంతా ఇదే స్కూల్‌లో చదువుకున్నామని గుర్తు చేశారు. స్కూల్ అభివృద్ధిలో భాగస్వామ్యులు కావటంతోపాటు పది సంవత్సరాల నుంచి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.